# అప్పటికి అరగంట నుంచీ ఏడుస్తోంది సుభద్ర. తలుచుకుని తలుచుకుని మరీ ఏడుస్తోంది.

'ఈ వెధవ బ్రతుకు బ్రతికే కన్నా తమ పెరట్లో వున్న దిగుడు బావిలో దూకి చావటం మేలు కాదీ.... పిల్లలు ?' అనుకుంటోంది.

ఈ ఇంట్లో పిల్లలు రెండు వర్గాలుగా చూడబడుతున్నారు. ఒకవర్గం.... అత్తగారి పిల్లలు. అంటే తన మరిది, ఆడపడుచులు. వీళ్ళది యాజమాన్య వర్గం. రెండు తన పిల్లలు శార్వాణి, బాబు, హైమ వీళ్ళది బానిస వర్గం !

ఇలాంటి అంతరాలేర్పరిచింది తన అత్తగారు కనకమ్మ. ఆవిడ పిల్లల అధికార దర్పం కింద తన పిల్లలు అణిగి మణిగి పడుండాలి. వాళ్ళు ముఖం కడుక్కోటానికి వీళ్ళు నీళ్ళు అందివ్వాలి. వాళ్ళు రెండు వాయిస్తే తన పిల్లలు గుడ్ల నీళ్ళు కుక్కుకుని, ఒక మూలకెళ్ళి నిశ్శబ్దంగా ఏడుస్తుంటే కడుపు తరుక్కుపోతుంది. అదేమంటే రాక్షసిలా విరుచుకు తింటుంది. ఈ ఇంటి ఏకచ్ఛత్రాధిపత్యమంతా గంగా భాగీరథీ సమానురాలైన అత్తగారిదే.

"మా అత్తగారు నన్ను జడకూడా వేసుకోనిచ్చేది కాదు. వేలు ముడి వేసుకోవాల్సిందే. శుభ్రంగా ముఖం కడుక్కుని తలదువ్వుకుంటే ...ఏమిటాభోగంవేషాలు! అని అరిచి, జడ విప్పి ముడేసుకునేదాకా ఊరుకునేదికాదు. మొగుడితో మాట్లాడితే తప్పు. నవ్వితే తప్పు....గబ గబా నడిస్తే తప్పు. ఇలా అన్నిటికీ సాధింపులే. నేను గనుక భరించాను. ఇంకోత్తయితే మన బావిలో పడి చచ్చూరుకునేది." అంటుంది కనకమ్మ కోడలితో. 'తను అన్ని బాధలు పడింది గనక, కోడల్ని అంతకు రెట్టింపుగా వేధించాలా? ఇదేం రూలు?' అని గొణుక్కునేది సుభద్ర.

అంతకు ముందు జరిగిన సంఘటన మనసులో మెదిలి మళ్ళీ కళ్ళలోకి నీళ్ళు చిప్పిల తన్ను కొచ్చాయి సుభద్రకి.

తన భర్త మంచి మూడ్‌లో ఉండగా తనకో సెంటు సీసా ప్రెజెంటు చేశాడు. దాన్ని పదిలంగా తన పెట్టెలో దాచుకుంది....

దొడ్లో బియ్యం కడుగుతుంటే, తన కొంగు పుచ్చుకుని ముందుకు ఒంగి రహస్యంగా "అమ్మా..సూరిపండు బాబాయ్ నీ పెట్టె తీస్తున్నాడు" అన్నది హైమ.

సూరిపండు తన మరిది.

గదిలోకొచ్చి చూసే సరికి సూరిపండు తన భర్త ఇచ్చిన సెంటు సీసా దొరకబుచ్చుకుని పారిపోతున్నాడు. చప్పున వెళ్ళి ఆ సీసా లాక్కుని "నీకింకోటి కొనిస్తానమ్మా. తప్పు. అలా పెట్టెలోది దొంగతనంగా తీసికెళ్ళకూడదు." అనునయంగా అన్నది సుభద్ర.

"అమ్మా, ఒదిన నా చేతిలో సెంటు సీసా లాక్కుని. 'దొంగతనం చేస్తావా' అంటూ కొట్టిందే." అని పెద్దగా ఏడుస్తూ తల్లి దగ్గరకు పరుగెత్తాడు సూరిపండు.



ఈ అభియోగానికి తెల్లబోతూనుంచుంది సుభద్ర. పెద్ద వాళ్ళ చర్యల ననుసరించే పిల్లల ప్రవర్తన కూడా ఉంటుంది

బారలుచాపుకుంటూవచ్చిందికనకమ్మ.

"నీకేం పొయ్యేకాలమొచ్చిందే? నా కొడుక్కి దొంగతనం అంటగడతావా? మాఇంటా వంటా లేవు అలాంటి బుద్ధులు. నీకూ, వాళ్ళకీ ఉన్నాయేమో. వస్తే గిస్తే నీ పిల్లలకే రావాలి. అయినా....వెధవ సెంటు సీసా కోసం అలా పడి చచ్చిపోవాలా?అదేమన్నా నీ బాబు కొనిచ్చిందా? వాడి అన్న వస్తువు మీద వాడికి అధికారంలేదూ? వాడిని కొట్టడానికి నీకెన్ని గుండెలే!?" అంటూ నోటికొచ్చినట్లు తిట్ట సాగింది కనకమ్మ. "సూరి బాబాయ్‌ని మా అమ్మేం కొట్టలేదు. అన్నీఅబద్ధాలు." కచ్చగా అన్నది హైమ.

"వేలెడు లేవు ముండా నువ్వు! అప్పుడే ఇంత పొగరా?" అంటూ ఆ పిల్లని పట్టుకుని ఎడా పెడా బాదేసిందావిడ.

హైమను పక్కలో పెట్టుకుని ఏడుస్తోంది సుభద్ర. ఆ పిల్ల తల్లి డొక్కలో దూరి, నిద్రల్లోకూడావెక్కిళ్ళు పెడుతోంది. పచ్చని చెంపమీద కనకమ్మ వేళ్ళగుర్తులు వాతల్లా కనిపిస్తున్నాయి....

తను బ్రతికుండగానే తన పిల్లలకు రక్షణ లేకుండా పోయింది. తను చస్తే? వీళ్ళనీరాక్షసి బ్రతకనిస్తుందా....

'అమ్మో! ఇలా ఎవరి డొక్కలోదూరి పడుకుంటుందీ పిచ్చిమొద్దు!' అనుకుంటూ హైమ నింకాస్త దగ్గిరికి లాక్కుంది సుభద్ర.

"అమ్మా! అన్నానికి రావూ?" భయం భయంగా అడిగాడు బాబు.

"నువ్వు తినేసిరా నాన్నా. నాకు ఆకలి లేదు." నెమ్మదిగా అన్నది సుభద్ర.

తల్లి వేపు దిగులుగా చూస్తూ వెళ్ళిపోయాడు వాడు. "ఏం? మీ అమ్మ దొరసాని కూటికి రాదటనా? మరేం పర్వాలేదులే.

రెండ్రోజులు మారితే.... ఒళ్ళు పొగరైనా దిగుతుంది. ఆ కంచం తెచ్చుకుని నువ్వు తగలడు." అంటోంది కనకమ్మ.

తన పిల్లల్ని ఇంత కన్నా అప్యాయతగా చూడదీవిడ. సాధారణంగా.... అత్తా కోడళ్ళకి పడకపోయినా... బామ్మలు మనవల్ని అభిమానంగా దగ్గరకు తీసి, తగినంత చనువిస్తారు. ఈ మహాతల్లికది కూడా లేదు. కోడలు కన్న పిల్లలు కాబట్టి వాళ్ళూ శతృవులే ఈవిడకి....

ఇవన్నీ తలచుకుని ఏడిచి, ఏడిచి అలసటగా కళ్ళు మూసుకుంది సుభద్ర.




మాగన్నుగా నిద్ర పడుతోంది....

"సుభద్రా. అన్నం పెట్టు." అంటూ ఆమెను కుదిపాడు రామారావు.

ఎర్రబారిన కళ్ళతో భర్త వేపు జాలిగా చూసిందామె వాచినట్లున్న ఆమె ముఖంలోకి చూస్తూ "ఏమయింది?" అన్నాడతను.

మధ్య మధ్య ఏడుస్తూ..పై టచెంగుతో కళ్ళు తుడుచుకుంటూ అంతా చెపుతోం సుభద్ర.

అన్నంతింటూ సావధానంగా వింటున్న అతను తల పైకెత్తి "ఐతే....నువ్వు అన్నం తినలేదా? నేనీ రాత్రి ఊరినుంచి రాకపోతే పస్తుండే దానివా?" అన్నాడు.

"అన్నమా! నా బొంద!" విరక్తిగా అన్నదామె.

"ఏడిసినట్లుంది. పొద్దున్న తిన్న అన్నం. మళ్ళీ రేపు మధ్యాహ్నం దాకా ఏం ఉండదు. ఇంకో కంచం తీసుకురా. అన్నం తిన్నాక, మిగిలింది చెపుదుగాని." అంటూ బలవంతంగా ఆమె చేత అన్నం తినిపించాడు రామారావు.

కనకమ్మ మంచి నిద్రలో ఉంది. ఈ వ్యవహారమంతా ఆవిడ దృష్టిలో పడలేదు.

'తనమొగుడు ఇంతిదిగా తనకు అన్నం పెట్టడం ఆవిడ చూస్తేనా....నాలుగు రోజుల పాటు అన్నం ఛాయలక్కూడా పోవటానికి భయపడి చచ్చేలా తిట్టి పోసేది.' అనుకుంటూ ఎంగిలి పళ్ళాలు తీసి శుద్ధిపెట్టి, గదిలోకొచ్చి, భర్తకు వక్కపొడి ఇచ్చి, లైటు తగ్గించి, అత న్నాను కొని కూర్చొని "ఏమండీ!" అన్నది సుభద్ర లాలనగా.

"చెప్పు. వింటున్నాను." అన్నాడు రామారావు.

"పిల్లలు మేధకుల్లా తయారవుతున్నారండీ. ప్రతి విషయానికి... మీ అమ్మగారికి, తమ్ముడికి, మీచెల్లెళ్ళకి అతిగా భయపడుతూ ఉండటం చేత మన పిల్లలు మరీ మైల్డ్‌గా అయి పోతున్నారు."

"నీమొహం. అదంతా నీ భ్రమ."

"అలా కొట్టిపారెయ్యకండి! నేనయినా ఎన్నేళ్ళని భరించను? కలిసుండి సాయిలా పాయిలాగా ఉండటం మీ అమ్మగారికి రాదు. మనం విడి పోదామండీ. మన బ్రతుకు మనం బ్రతుకుదాం."

"వాళ్ళేమవుతారు?"

"ఆస్తి మూడొంతులు వాళ్ళనే తీసుకోమనండి. ఒకవంతు చాలు మనకి. ఆపైన.. మీరెక్కాల కష్టం ఉండనే ఉంది. ఎవరి సాధింపూ లేకుండా....నా ఇంట్లో నేను పిల్లలు మీతో కలిసి స్వేచ్ఛగా బ్రతకాలనుందండీ."

"నేనీ ఇంటికి పెద్దకొడుకుని. ఈ కుటుంబంలో ఇంత వరకూ ఎవరూ ఆస్తులు పంచుకుని బయటకు పోలేదు. మా అమ్మ కూడా వాళ్ళ అత్తగారి చేతుల్లో నానా అగచాట్లు పడింది. అయినా....మా నాన్న వేరింటి కాపరం పెట్టలేదు. నేనూ అంతే. నాచేతుల్తో నేనీ ఉమ్మడి కుటుంబ వ్యవస్థను విచ్ఛిన్నం చెయ్యలేను. అలా చేస్తే ఈ ఇంటి పయివేం గాను? అయినా... వెధవ సెంటు సీసా కోసం ఇంత రాద్ధాంతమెందుకు? వాడికే పడేస్తే పోలా? ఇంకోటి తెప్పించు కోవచ్చుగా...." అంటూ అటు తిరిగి పడుకుని నిద్రలోకి జారిపోయాడు రామారావు.

నిస్పృహగా చూసింది సుభద్ర.

పైకి వెధవ్విగా, చిన్నవిగా కనపడే విషయాల వెనుక కూడా కొన్ని సెంటిమెంట్లు, స్పందనలు ఉంటాయనే విషయం ఈ మనుషుల కర్థం కాదేమో. అయినా.... జరిగిందాంట్లో తన తప్పేం ఉందని ఆవిడన్ని మాటలనాలి? ఈయన ఆ విషయం మాట్లాడరేం? ఛీ.. వెధవ బ్రతుకు. ఈ పిల్లలడ్డం రాకపోతే ఎప్పుడో ఈ జీవిత నాటకం నుంచి తప్పుకునేది.

అక్కడనుంచి లేచి హైమను పక్కకు జరిపి, తనూ పడుకుంది సుభద్ర.

రోజులూ వారాలూ నెలల్నీ తరిమితే... నెలలు సంవత్సరాలను తరమ సాగాయి...

సుభద్ర సుభద్రమ్మగా మారింది.

సూరి పండుకు, మిగిలిన ఆడ పడుచులకీ, శార్వాణికీ పెళ్ళిళ్ళయి ఎవరి దారిన వాళ్ళు వెళ్ళిపోయారు.

బాబు శార్వాణి దగ్గర చదువు కుంటునాడు.

ఇంట్లో కనకమ్మ,సుభద్రమ్మ,హైమ, రామారావు మిగిలారు.

కనకమ్మ బాగా పెద్దదయి పోయింది. మతిలేని పనులు చేస్తుంటుంది. ఒక్కోసారి ఊరికే గొణుగుతూ ఉంటుంది. నిద్రలో లేచి వెళ్ళి పోతూ ఉంటుంది....

రాత్రి పూట అన్ని తలుపులకూ తాళాలేసి పడుకునేవారు.

ఆ రోజు ... ...

నడుం పోయేలా చచ్చేటట్లు మినప పప్పు రుబ్బి, బూడిద గుమ్మడికాయ తరిగి కలిపి తెల్లని బట్టమీద ఒడియాలు పెట్టింది సుభద్రమ్మ.


కాసేపు నడుం వాలుద్దామని మంచం వాల్చు కుంటుంటే "నా చీరలన్నీ ఎవరూ అలా తడిపి పారేశారు? ఇప్పుడు స్నానం చేసి నేనేం కట్టుకోవాలి?"అంటూ వచ్చింది కనకమ్మ.

"నేనే ఆరేశాను మీరు వాటిని పాడు చేసుకున్నారు. పొద్దున స్నానం చేశారుగా, మళ్ళీఇప్పుడెందుకు? సాయంత్రం చేద్దురుగానివెళ్ళిపడుకోండి " అన్నదిసుభద్రమత

"ఏమిటీ? నేనుచీరలు పాడుచేశానా? నేనేం కుర్ర ముండననుకున్నావా? మీరే ఎవరో కావాలని పాడు చేసుకుంటారు."

"ఔను, మేమే పాడుచేశాం. సరేనా? ఇహ వెళ్ళండి....

"ఏమిటీ వెళ్ళు వెళ్ళని తరుముతావ్? ఇది నా కొడుకిల్లు నేనిక్కడే ఉంటాను.



అరుచుకుంటూ తన గదిలోకెళ్ళి. మంచం బ్రరున లాక్కుని పడుకుంది కనకమ్మ.

"అమ్మా. భవతీ భిక్షందేహితల్లి." వాకిట్లో నుంచికేక. "మిట్ట మధ్యాహ్నం ఇప్పుడేం బిచ్చం? వెళ్ళు వెళ్ళు." విసుగ్గా అన్నది సుభద్రమ్మ.

ఎప్పుడు లేచొచ్చిందో కనకమ్మ గబగబా ఓ దోసెడు బియ్యం వాడి జోలెలో పోసొచ్చి "ఈ ఇంటికొచ్చిన బిచ్చగాడు వట్టి చేతులతో వెళ్ళలేదింత వరకూ." అన్నది కోడలు వేపు విజయగర్వంతో చూస్తూ.

"ఈవిడతో నాకు చావొచ్చి పడింది. ఛీ ఛీ. పదమూడేళ్ళ వయసులో....ఏ లగ్నాన ఈ కొంపలో పడ్డానో... ఒక్క రోజుకూడా ప్రశాంతంగా గడిపింది లేదు. ఇంత వయసొచ్చినా ఈవిడ పోరు తప్ప లేదు నాకు. ఎప్పటికి విముక్తి కలుగుతుందో!" అని గొణుక్కుంటోంది సుభద్రమ్మ. ఓ గంట సేపయ్యాక "అమ్మా! ఓసారిలారా!" అంటూ దొడ్లో నుంచి కేక వేసింది హైమ

ఎప్పుడు స్నానం చేసి వచ్చిందో.... తడి చీర జామ చెట్టు కొమ్మకు ఓ కొన ముడివేసి గట్టిగా లాగేసరికి ఆ ముడి ఊడొచ్చి ఆ విసురుకు రాయిమీద పడింది కనకమ్మ. నుదుటి మీద రక్తం....

కంగారుగా వెళ్ళి సుభద్రమ్మ. హైమ అవిడను మోసుకొచ్చి వసారాలో మంచం మీద పడుకోబెట్టారు.

గుడ్డ తడుపుకొచ్చి. గాయం తుడిచి. కాస్త టించర్ దూదిలో ముంచివేసి. కట్టు కట్టింది సుభద్రమ్మ. మొహాన కాసిని నీళ్ళు చిలకరించి విసురుతూ కూర్చుంది.

కాసేపటికి కళ్ళు తెరిచి "ఆరేద్దామని వెళ్ళానే. చీరబురదలో పడిందా?" అన్నది కనకమ్మ

"పడితే పడింది లేండి నేను ఝాడించి ఆరేస్తాను మీరుపడుకోండి." మృదువుగా అంటూ "ఏమిటో! పెద్దతనం. మతిసరిగ్గా ఉండటంలేదు." విట్టూరుస్తూ అనుకుంది సుభద్రమ్మ.

ఆరోజు ఆదివారం. రాత్రికి కనకమ్మ అన్నంతినదు. ఫలహారం చెయ్యాలి కాస్త పెందలాడే చేస్తే....పిల్లు.... ఆయనకూడా తింటాడు. అనుకుని. బియ్యంరవ్వ వళ్ళెం లో పోసుకొని ఏరుతోంది సుభద్రమ్మ.

"అమ్మా ఓసారిలా రా." అంటూ తల్లి రెక్క పుచ్చుకొని సందులోకిలాక్కెళ్ళింది హైమ.

హైమ చూపించిన వేపు చూస్తూ స్థాణువులా నిలబడింది సుభద్రమ్మ.

దొడ్లో ఎండ బెట్టిన వడియాలన్నీ పిసికేసి. కొంత. కొంత తీసుకుని ఇసకలోకి విసిరేస్తోంది కనకమ్మ. పట్టరాని ఆవేశంతో ఆవిడని రెక్కపట్టి లాక్కొచ్చి దొడ్డి వసారాలో కూలేసింది.

మతి లేని స్థితిలో కూడా తనను మానసికంగా బాధించే పనులు చెయ్యడం మానలేదీవిడ. మొన్నటికి మొన్నా అంతే. కొత్త చీర దొడ్లో ఆరేసుకుంటే ఎవరూ చూడకుండా వెళ్ళి. ఆచీరను మధ్యకు చింపేసింది. కేవలం తన చీర మాత్రమే చింపింది. కొడుకు పంచె పక్కనే ఉన్నా దాని జోలికెళ్ళలేదు.

తనను సాధించాలనే తాపత్రయం ఆవిడలో అంత బలంగా ఉందన్నమాట! మతిలేని స్థితిలో కూడా ఆవిడా ప్రభావం నుంచి బయట పడలేక పోతోంది.

ఆవిడకెందుకింత కక్ష తన మీద?

అన్నీ మంచంలోనే జరిగిపోతుంటే... ఆ బట్టలు ఝాడించీ....ఆవిడకు స్నానం చేయించీ....తను ఎంత సేవ చేసినా ఆవిడ కాగ్రహింపు లేదు.

ఇదేం ఖర్మ?

తల్లి కళ్ళలో నిలిచిన నీరు చూసి "ఆవిడను కూతురు దగ్గరికి పంపెయ్యరాదూ?" అన్నది హైమ కసిగా.

"కొడుకు చూడటం విధాయకం. కూతురెందుకు చూడాలి?" గద్గద స్వరంతో అన్నది సుభద్రమ్మ.

"మూరి బాబాయ్ ఉద్యోగం వంకతో హాయిగా దూరం వెళ్ళిపోయి సుఖపడుతున్నాడు. ఎన్నేళ్ళొచ్చినా నీకా గోల తప్పలా. ఛీ... ఏ ఇంటికీ పెద్ద కోడలుగా వెళ్ళినంత నరకం ఇంకోటి లేదు." విసుక్కుంటూ అన్నది హైమ.

ఇలాగే కొన్ని నెలలు గడిచాయి.

ఓ రోజు........

"మీ బామ్మని అన్నానికి పిలవ్వే హైమా." అన్నది సుభద్రమ్మ.

"బామ్మా బామ్మా...." అని పిలిచి "అమ్మా ఈవిడ పలకటల్లేదు." అన్నది హైమ.

సుభద్రమ్మ వచ్చి పిలచినా పలకలేదు కనకమ్మ. సన్నగా గురకలాంటి శబ్దం వస్తోంది.

కంగారుగా భర్త దగ్గరకు పరుగులాంటి నడకతో వెళ్ళి "త్వరగా డాక్టర్ని పిలవండి. మీ అమ్మగారికి బాగోలేదు." అన్నది సుభద్రమ్మ.

చొక్కా వేసుకెళ్ళి డాక్టర్ని తీసుకొచ్చాడు రామారావు. డాక్టరు కనకమ్మకి ఇంజక్షన్ చేసి. మందులిచ్చి. ఎలావాడాలో చెప్పి వెళ్ళాడు.

గురక అలాగే ఉంది. శబ్దం ఇంకాస్త పెరిగింది. మగతగా పడుకునుంధి కనకమ్మ.

నెమ్మదిగాలేపి.ఆవిడతల తన గుండెలకానించుకొని.మెత్తగా పిసికిన మజ్జిగన్నం స్పూన్‌తో కొద్ది కొద్దిగా తినిపించి. తడి చేత్తో మూతి తుడిచి పడుకోబెట్టింది సుభద్రమ్మ.

రెండు రోజులు గడిచాయి.

"మరేం వర్వాలేదులెండి. తగ్గి

## మానవ నైజం

ఆ దేవుడు సృష్టించిన
మనుషులం మనమైతే
ఆ దేవునికి రూపం
కల్పించింది మనమే!
అవకాశం దొరికితే ఆ రూపంతో
సొమ్ము చేసుకోగలం!



ఆ సొమ్మే ఖర్చు అవుతుందని
తెలిసిన మరుక్షణం
మనం కల్పించిన ఆ దేవుడే
ఎదురుగా దిగివస్తే
కాదు పొమ్మని తరిమేయగలం!

—కె.వి. శ్యామసుందర్

పోతుంది." అని భరోసా ఇచ్చాడు డాక్టరు.

ఆ రోజు అర్థరాత్రి హఠాత్తుగా మెలకువ వచ్చింది సుభద్రమ్మకు. చెవి వొగ్గి విన్నది....

గురక వినబడ్డంలేదు. అనుమానంగా మంచం దిగొచ్చి అత్తగారిమంచందగ్గరకు వెళ్ళింది....

కనకమ్మ శరీరం కట్టెలా మారి పోయింది.

భర్తను లేపుకొచ్చింది సుభద్రమ్మ. ఆమె కళ్ళ వెంట నీళ్ళు ధారాపాతంగా కారిపోతున్నాయి....

అందరికీ కబుర్లు వెళ్ళాయి. ముసలావిడ కూతుళ్ళు. చిన్న కొడుకు. కోడలు. ఆవిడ అప్ప చెల్లెళ్ళు వచ్చారు.


"ఆవిడకేం పెద్దదయి పోయింది. చూడవలసిన కార్యాలూ కరమ్మత్తులు చూసేసింది. హాయిగా.... కొడుకూ కోడలు చేతుల్లో పువ్వులా వెళ్ళిపోయింది. ఇంకా ఉండి ఏం చెయ్యాలి గనక?" అన్నారు ఊళ్ళో చూడవచ్చిన వాళ్ళంతా. "మరే మరే." అంటూ వంత పాడేరు కూతుళ్ళ వగైరాలు.

కర్మ కాండలన్నీ యధావిధిగా జరిగి పోయాయి. వచ్చిన చుట్టాలంతా వెళ్ళి పోయారు.

కనకమ్మ గదిలో ఒంటరిగా కూర్చొని మాటి మాటికీ తడి అవుతున్న కళ్ళను చెంగుతో అద్దుకుంటున్న సుభద్రమ్మ దగ్గిరగా వచ్చింది హైమ.

"అమ్మా. ఇప్పటికైనా నీ కష్టాలు గట్టెక్కాయి. నీకు విముక్తి లభించింది. ఏడవకమ్మా." అన్నది.

"ఛ! అలా అనకే. మీ బామ్మ లేక పోతే ఏం బావుంది? ఇల్లంతా బావురు మంటున్నట్లుంది. ఇంట్లో పెద్ద దిక్కుగా ఆవిడుంటే ...ఆఅందమేవేరు.ఎంతధైర్యంగా ఉండేదని! నాకు నడుం విరిగి పోయినట్లే ఉంది." అంటున్న తల్లివేపు విభ్రాంతిగా చూస్తూ మూఢురాలిలా నిలబడి పోయింది హైమ!



చెరకు విండ్ల చివరలో దీపికలై మా ఆశయములె మెరయునుగా మాధురులై

—ఫోటో: ఎం.వి.యస్., మద్దిపాడు


# బాలజ్యోతి

బాలజ్యోతి 55
బాలజ్యోతి 56
బాలజ్యోతి 57

గిఫ్ట నంబర్లు

## ఫొటో ఆల్బమ్ గిఫ్ట్ నంబర్స్

బాలజ్యోతి ఫొటో ఆల్బమ్ గిఫ్ట్‌నెంబర్లు సేకరించేవారు ఇక్కడ ప్రచురించిన గిఫ్టునెంబర్లు కూడా కత్తిరించి డిసెంబరు నెలాఖరుకు బాలజ్యోతి, పి.బి.నెం. 712, విజయవాడ-10'కి పంపవచ్చు.

## ఫొటోగ్రాఫర్లకు విజ్ఞప్తి

బాలజ్యోతి ఫొటోవ్యాఖ్య పోటీలో ప్రచురణార్థమై ఫొటోలు పంపవలసినదిగా ఔత్సాహిక,వృత్తి ఫొటోగ్రాఫర్లకు విజ్ఞప్తి.

వివిధ భంగిమలలో పిల్లల వివిధ చేష్టలు, ఆటలకు సంబంధించిన 10½×10½ సె.మీ. సైజులలో చక్కని బ్యాక్‌గ్రౌండుతో తీసిన యాక్షన్ ఫొటోలను 'ఎడిటర్, బాలజ్యోతి, పి.బి.నెం. 712, విజయవాడ'కి పంపగోరుచున్నాము. ఫాన్సీ డ్రస్సులలోని యాక్షన్‌ఫొటోలు కూడా పంపవచ్చు. ప్రచురితమైన ప్రతి ఫొటోకు పారితోషికం వుంటుంది. ప్రచురణకు స్వీకరింపబడని ఫొటోలు త్రిప్పి పంపగోరువారు తగిన స్టాంపులుగల స్వీయ చిరునామా కవరు విధిగా జతపరచాలి.